క్లుప్తంగా

'వరద ప్రవాహానికి అడ్డంగా నిర్మాణాలు'

రఘునాథపల్లి: వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చి వరద ప్రవాహ వ్యవస్థకు అడ్డంగా చేపడుతున్న నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని మండల కేంద్రానికి చెందిన సామాజిక కార్యకర్త ఠాకూర్ గణేష్‌సింగ్ బుధవారం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. క్షేత్రస్థాయిలో చెరువు, వాగు లాంటివి ఉన్నాయా అన్నది పట్టించుకోకుండా నాలా కన్వర్షన్ చేయడం వల్లే ఈ ఇబ్బందులు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. రాజకీయ నాయకుల జోక్యంతో వాగులకు అడ్డుగా చేపడుతున్న నిర్మాణాలపై చర్యలు తీసుకోవడం లేదని, దీంతో సమీపంలోని పంట పొలాలు మునిగి రైతులకు నష్టం జరుగుతుందన్నారు. నాలా కన్వర్షన్ చేయాల్సి వస్తే ఇరిగేషన్, గ్రామ పంచాయతీ, మున్సిపల్ అధికారి నుంచి ఎన్‌వోసి తప్పని సరి చేయాలన్నారు. మండల కేంద్రంతో పాటు, పలు ప్రాంతాల్లో వరద ప్రవాహ వ్యవస్థకు అడ్డుగా పక్కా భవనాలు, పెట్రోల్ బంకులు, హోటళ్లు నిర్మిస్తున్నారన్నారు. వరద ప్రాంతాల్లో గతంలో ఇచ్చిన నాలా కన్వర్షన్‌లు అవసరమైతే రైతుల క్షేమం కొరకు రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. తన వినతికి సానుకూలంగా స్పందించారని ఆయన పేర్కొన్నారు.

పుస్తె, మెట్టెల అందజేత



పుస్తె, మెట్టెలు అందజేస్తున్న అరవింద్‌రెడ్డి

బచ్చన్నపేట: కేసిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన గొల్లూరి సుకన్య-అనిల్‌ల వివాహానికి ఆ గ్రామ మాజీ సర్పంచ్ మల్లవరం దివ్య, మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ అరవింద్‌రెడ్డి పుస్తెమట్టెలను బుధవారం అందించారు. అలాగే వాస్విక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కూడా పుస్తె మట్టెలను అందించారు. మల్లవరం సుశ్మిత-వెంకటేశ్వర్లు రెడ్డిలు రూ. 5వేలు, ఇమ్మడి రాధ-సత్యనారాయణ దంపతులు రూ. 5 వేలు ఇచ్చారు. ఆముదాల భూపాల్‌రెడ్డి. గాలి తిరుపతి, సాగర్, బాల్‌రాజు ఉన్నారు.

కంఠమహేశ్వరస్వామి మహోత్సవం

పాలకుర్తి: మండలంలోని దర్దేపల్లి గ్రామంలో కంఠమహేశ్వరస్వామి, సురమాంభ దేవిల పండుగ మహోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. గౌడ సంఘం ఆధ్వర్యంలో కులస్తులు కంఠమహేశ్వర స్వామి, ఎల్లమ్మ, మైసమ్మ దేవతకు జలాభిషేకం చేసి కుంకుమార్చన కార్యక్రమాన్ని చేపట్టారు. సహకార సంఘం అధ్యక్షుడు గిరగాని నర్సయ్య, కార్యదర్శి తాళ్లపల్లి మదార్, పిచ్చయ్య, యాకయ్య, సుధాకర్, తాళ్లపల్లి కుమార్‌స్వామి, మాజీ ఎంపీటీసీ గిరగాని సుధా సమ్మయ్య, గిరగాని కుమారస్వామి పాల్గొన్నారు.

చేయూత



సాయం అందజేస్తున్న పూర్వవిద్యార్థులు

జఫర్‌గఢ్: మండల కేంద్రానికి చెందిన కాల్వ రాజు ఇటీవల మృతి చెందాడు. కాగా, విషయం తెలుసుకున్న 1998-99 ఎస్సెస్సీ బ్యాచ్‌కి చెందిన తోటి పూర్వ విద్యార్థులు రూ.50 వేల సాయం బుధవారం స్నేహితుడి దశదినకర్మ రోజున కుటుంబీకులకు అందజేశారు. ఈ సందర్భంగా రాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి సంతాపాన్ని తెలిపారు. పూర్వ విద్యార్థులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి..

దేవరుప్పుల: మండలంలోని వివిధ గ్రామాల్లో ఎమ్మెల్యే యశస్విని రెడ్డి బుధవారం పర్యటించి బాధిత కుటుంబాలను పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. నల్లకుంట తండా గ్రామంలో ఇటీవల మరణించిన బానోత్ వెంకన్న, కామారెడ్డి గూడెంలో మోలుగురి శ్యాం, పెద్దమడూర్ గ్రామంలో కన్నా యాదగిరి సతీమణి కన్నా విమల ఇటీవల మరణించారు. కాగా, వారి కుటుంబాలను పరామర్శించి సాయం అందజేశారు.

ప్రజల్లో మార్పునకు కళాజాతా



మాట్లాడుతున్న ఎస్సై నవీన్‌కుమార్

చిల్పూరు: ప్రజల్లో మార్పు తీసుకువచ్చేందుకే జాగృతి పోలీస్ బృందంతో కళాజాతా నిర్వహించడం జరుగుతుందని ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం రాత్రి వరంగల్ సీపీ ఆదేశాల మేరకు జాగృతి పోలీస్ కళా బృందం రోడ్డు ప్రమాదాలు, డయల్100, బాల్య వివాహాలు నిర్మూలన తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కళాబృందం ఇన్‌చార్జ్ నాగమణి, సభ్యులు విలియం, వెంకటేశ్వర్లు, రత్నయ్య, శ్రీనివాస్, నారాయణ, విక్రమ్‌రాజు, చిరంజీవిలతో పాటు ఏఎస్సై జయకుమార్, సిబ్బంది వీరన్న, గ్రామస్తులు పాల్గొన్నారు.

కాసుల వేటలో ఖాకీలు..!

- వరుస సస్పెన్షన్లతో పోలీసుశాఖకు మాయని మచ్చ
- ప్రక్షాళన చేయాలని కోరుతున్న మండల ప్రజలు



తరిగొప్పుల పోలీస్‌స్టేషన్

తరిగొప్పుల: సమాజ రక్షణతో పాటు క్రమశిక్షణకు చిరునామాగా ఉండాల్సిన నాలుగో సింహం గాడితప్పుతోంది. ప్రజలకు ఆదర్శంగా నిలవాల్సిన పోలీసులే లంచాలకు, అక్రమాలకు ఎగబడుతున్నారు. ఒకరిని చూసి మరొకరు పోటీపడి వసూళ్లకు తెగబడుతుంటే ప్రజలు నిర్ఘాంతపోయే పరిస్థితి మండలంలో నెలకొంది. సామాన్యులకు న్యాయం చేయాల్సిన పోలీస్ అధికారులు, సిబ్బంది కాసుల కోసం అడ్డదారులు తొక్కుతున్నారు. సామాన్యులు,పేదప్రజలు అనే తేడా లేకుండా డబ్బులే పరమావధిగా పని చేస్తున్నారు. జిల్లాలోని నర్మెట సర్కిల్ పరిధిలోని తరిగొప్పుల పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తించే కానిస్టేబుళ్లు వరుసగా సస్పెన్షన్ అవుతుండడంతో మండల ప్రజలు పోలీస్‌శాఖ తీరుపై మండిపడుతున్నారు. ఇటీవల అత్తాకోడలు కొట్టుకున్న వివాదంలో కేసు నమోదు విషయంలో రూ.20 వేలు లంచం డిమాండ్ చేసి స్టేషన్ రైటర్‌తో పాటు హెడ్ కానిస్టేబుల్ సస్పెన్షన్‌కు గురైన విషయం మండల ప్రజలు మరచిపోకముందే, తాజాగా ఓ గుడుంబా కేసులో స్టేషన్ బెయిల్ మంజూరు కోసం ఏకంగా స్టేషన్ హౌజ్ ఆఫీసర్ (ఎస్సై) సంతకాన్నే ఫోర్జరీ చేసిన విషయంలో స్టేషన్ రైటర్ తో పాటు మరో కానిస్టేబుల్ మంగళవారం సస్పెన్షన్‌కు గురికావడంతో మండల వ్యాప్తంగా చర్చనీయంగా మారింది.

ఒక్కో వ్యాపారానికి ఒక్కో రేటు..

మండల పరిధిలో కొనసాగుతున్న పలు అక్రమ వ్యాపారాలకు ఒక్కో వ్యాపారానికి ఒక్కో రేటును నిర్ణయించి నెల నెల మామూళ్లు వసూళు చేస్తున్నారు. అక్రమ ఇసుక రవాణా మొదలుకొని రేషన్ బియ్యం, అక్రమ కలప దందా, మొరం దందా ఇలా ప్రతీ అక్రమ వ్యాపారానికి రూ.15 వేల నుంచి 30 వేల వరకు మామూళ్లు వసూళు చేస్తూ అక్రమ వ్యాపారులకు కొమ్ముకాస్తున్నారు. దీనికి తోడు పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రతీ పిటీషన్‌కు ఇరువర్గాల నుంచి డబ్బులు వసూళు చేస్తుండడం పరిపాటిగా మారింది. ఇప్పటికైనా సంబంధిత శాఖ ఉన్నతాధికారులు పోలీస్‌స్టేషన్‌లో పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేపట్టి ప్రజల్లో పోలీస్‌శాఖపై నమ్మకం కలిగించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

- ఎమ్మెల్యే కడియం శ్రీహరి



ఉత్సవాల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీహరి

రఘునాథపల్లి: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత కలుగుతుందని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. బుధవారం మండలంలోని మండలగూడెంలో ముదిరాజ్ కులస్తుల ఆధ్వర్యంలో జరిగిన పెద్దమ్మతల్లి తొమ్మిదవ వార్షికోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పెద్దమ్మ తల్లి ఆశీస్సులు, దీవెనలు గ్రామస్తులందరిపై ఉండాలని, గ్రామ ప్రజలందరూ సుఖ సంతోషాలు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ప్రార్థించారు. కులస్తులు ఉమ్మడిగా పెద్దమ్మ తల్లి ఉత్సవాలు నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు. ఆలయాల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మారుజోడు రాంబాబు, లింగాల జగదీష్‌చందర్‌రెడ్డి, బొల్లం అజయ్, బొనాసి క్రాంతికుమార్, మానంపల్లి లింగాజీ, మేకల నరేందర్, ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఉత్తెపు సత్యనారాయణ, డ్యాగల రాజశేఖర్, పర్శ సురేష్, చంద్రయ్య, బిక్షపతి, శేఖర్, కనకయ్య, మహేందర్, శ్రీనివాస్, సిద్దులు , కుమార్, భూపాల్, కుమారస్వామి, రమేష్, అజయ్, నర్సింగం పాల్గొన్నారు.

మిల్లులకు ధాన్యం తరలించాలి

చిల్పూరు: కొనుగోలు కేంద్రాల నుంచి రెండు రోజుల్లో ధాన్యాన్ని మిల్లులకు తరలించకుంటే ఆదివారం రైతులతో కలిసి ఆందోళన కార్యక్రమాలను నిర్వహిస్తామని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి వెలిశాల శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో నిల్వ ఉన్న ధాన్యాన్ని బుధవారం బీజేపీ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ వర్షాలు కురుస్తుండటంతో కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు ఇబ్బంది పడుతున్నారన్నారు. తోట శ్రీనివాస్, దిలీప్, నారగోని శ్రీనివాస్, వెంకన్న తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ కుట్రతోనే కేసీఆర్‌కు నోటీసులు

- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య

స్టేషన్‌ఘన్‌పూర్: బీఆర్‌ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై కాంగ్రెస్ పార్టీ కుట్రపూరితంగా వ్యవహరిస్తుందని, కుట్రలో భాగంగానే కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో కేసీఆర్‌కు నోటీసులు జారీ చేసిందని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయమై కేసీఆర్‌కు నోటీసులు జారీ చేసిన నేపథ్యంలో రాజయ్య మంగళవారం విలేకరుతో మాట్లాడారు. కేసీఆర్‌కు నోటీసులు జారీ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ఇది పూర్తిగా కాంగ్రెస్ పార్టీ కుట్రయేనని, ప్రజల్లో విశ్వాసం కోల్పోతున్న రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కేసీఆర్‌ను లక్ష్యంగా చేసుకుని ఆయన ప్రతిష్టను దెబ్బతీయాలని చూస్తున్నారన్నారు. ప్రజలు ఈ కుట్రలను గమనిస్తున్నారని, కాంగ్రెస్ పార్టీ నాటకాలను ప్రజలు విశ్వసించరన్నారు. కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ప్రపంచంలోనే పెద్ద బహుళ దశల పంపింగ్ ప్రాజెక్టుగా చరిత్రలో స్థానం సంపాదించిందని, 18 లక్షల ఎకరాలకు పైగా సాగునీరు అందిస్తుందన్నారు. గొప్ప ప్రాజెక్టును నిర్మించిన కేసీఆర్‌ను తక్కువ చేయాలన్న కాంగ్రెస్ ప్రయత్నాలు అప్రజాస్వామికంగా ఉన్నాయని పేర్కొన్నారు. కేసీఆర్ రాజకీయం చేయలేదని, తెలంగాణను తీర్చిదిద్దారని, కేసీఆర్ నాయకత్వం లేకపోతే కాళేశ్వరం ప్రాజెక్టు సాధ్యమయ్యేది కాదన్నారు. కాంగ్రెస్ పార్టీ రాజకీయ ప్రయోజనాల కోసం అభివృద్ధి పరంగా జరిగిన ప్రాజెక్టులను లక్ష్యంగా చేసుకోవడం తగదని హెచ్చరించారు.

హనుమాన్ జయంతికి ఆలయాల ముస్తాబు



బచ్చన్నపేటలోని భారీ హనుమంతుడి విగ్రహం



జనగామ పట్టణం గుండ్లగడ్డలోని ఆంజనేయస్వామి ఆలయం



స్టేషన్‌ఘన్‌పూర్: ఆలయంలో పూజ చేస్తున్న భక్తమండలి బాధ్యులు

జనగామ: జిల్లాలో గురువారం నిర్వహించే హనుమాన్ జయంతిని పురస్కరించుకుని ఆలయాలను ముస్తాబు చేస్తున్నారు. జిల్లాలో 5వేల మందికి పైగా భక్తులు హనుమాన్ మాలాధారణ స్వీకరించారు. 108, 41, 21, 11 రోజుల మాలాధారణ ధరించి, అత్యంత నిష్టతో భక్తిని చాటుతున్నారు. హనుమాన్ జయంతిని పురస్కరించుకుని మాలా విరమణ కోసం జిల్లా నలుమూలల నుంచి స్వాములు విజయవాడ, కొండగట్టు, భద్రాచలం, ధర్మపురి, యాదగిరిగుట్ట తదితర దేవస్థానాలకు బయలుదేరారు. జనగామ వీవర్స్ కాలనీకి చెందిన స్వాములు కొండగట్టుకు రెండు రోజుల క్రితం కాలినడకన బయలు దేరారు. ఇరుముడి తలపై పెట్టుకుని హనుమాన్ సంకీర్తనలు చేస్తూ ర్యాలీగా బయలు దేరగా, గ్రామస్తులు వారికి వీడ్కోలు పలికారు. జిల్లా కేంద్రంలోని బాణాపురం, గణేష్ స్ట్రీట్, గుండ్లగడ్డ, గిర్నిగడ్డ, హౌజింగ్‌బోర్డు, హెడ్ పోస్టాఫీసు ఏరియాలోని శ్రీ సంతోషీమాత, గ్రేయిన్ మార్కెట్, గుండ్లగడ్డ, అమ్మబావి సమీపంలోని ఆంజనేయ స్వామి తదితర ప్రాంతాల్లోని హనుమాన్ ఆలయాల్లో నేడు ప్రత్యేక పూజలతో పాటు హోమాలు, అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు.

ఉత్సవాలకు ఏర్పాట్లు

స్టేషన్‌ఘన్‌పూర్: భక్తజన కొంగుబంగారమైన హనుమాన్ జయంతి ఉత్సవాలను నేడు స్టేషన్‌ఘన్‌పూర్ డివిజన్‌కేంద్రంలో ఘనంగా నిర్వహించేలా హనుమాన్ భక్త మండలి ఆధ్వర్యంలో ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు స్థానిక చెరువు కట్ట హనుమాన్ దేవాలయంలో హనుమాన్ భక్త మండలి ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక పూజలు చేపట్టారు. హనుమాన్ భక్త మండలి బాధ్యులు గోనెల ఎల్లయ్య, గోనెల రాజేందర్, ఇల్లందుల ప్రసాద్, పెసరు సారయ్య, మొగుదుంపురం కిషోర్‌కుమార్, గోనెల ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇరుముడితో కొండగట్టుకు హనుమాన్ మాలధారులు



రఘునాథపల్లి: ఇబ్రహీంపూర్ నుంచి కొండగట్టుకు వెళ్తున్న మాలధారులు

రఘునాథపల్లి: ఇబ్రహీంపూర్ శివాలయంలో బుధవారం హనుమాన్ మాలధారులు వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు చేసి ఇరుముడి కట్టుకున్నారు. ఇరుముడి ధరించిన స్వాములు రామ భజనలతో ప్రత్యేక వాహనంలో కొండగట్టుకు బయలు దేరారు. వీధుల గుండా వెళ్తున్న స్వాముల కాళ్లకు మహిళలు నీళ్లు పోసి మొక్కుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో భక్తి పారవశ్యం నెలకొంది. హనుమాన్ మాలదారులు పోకల శ్రీనివాస్, బాషుపెల్లి హేమేందర్, శివార్ల కుమార్, గిరబోయిన సతీష్, నిమ్మల సారయ్య, పండుగ శేఖర్, పండుగ అంజనేయులు ఉన్నారు.

నేడు శోభాయాత్ర

అశ్వరావుపల్లి గుప్తా ప్రసన్న భక్త అంజనేయ దేవాలయం ఆధ్వర్యంలో గురువారం వీర హనుమాన్ విజయ శోభాయాత్ర (బైక్ ర్యాలీ) నిర్వహించనున్నట్లు ఆలయ ప్రతినిధి రవికుమార్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. హనుమాన్ జయంతిని పురస్కరించుకొని ఆలయం నుంచి అశ్వరావుపలి, వెల్ది గ్రామాల మీదుగా రఘునాథపల్లి హనుమాన్ మందిరం వరకు శోభా యాత్ర కొనసాగుతుందన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.



బచ్చన్నపేట నుంచి..

బచ్చన్నపేట: మండలంలోని పలు గ్రామాల్లో హనుమాన్ మాలాధారులు ఆలయాలలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. మాల విరమణకోసం హోమాలు, యజ్ఞాలు చేసి ఇరుముడిని కట్టుకుని కొండగట్టుకు బయలు దేరారు.

ఘనంగా అహల్యాబాయి జయంతి



మహా హారతి కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

జనగామ రూరల్: రాజమాత అహల్యాబాయి హోల్కర్ జయంతి పురస్కరించుకుని సందర్భంగా పట్టణంలోని స్థానిక దుర్గమ్మ దేవాలయంలో జిల్లా మహిళా మోర్చ అధ్యక్షురాలు కత్తుల లక్ష్మి ఆధ్వర్యంలో మహా హారతి కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షురాలు నీరజ, భవాని, అనుష, రాష్ట్ర నాయకుడు ఆరుట్ల దశమంతరెడ్డి, భువనగిరి పార్లమెంట్ కోకన్వీనర్ కొంతము శ్రీనివాస్, కల్నల్ భిక్షపతి, పవన్ శర్మ , నర్సిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు అనిల్, తోకల హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

గీతకార్మికులకు 'రక్షణ కిట్లు'

- బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి రవీందర్



కాటమయ్య కిట్లను పంపిణీ చేస్తున్న జిల్లా అధికారి రవీందర్


బచ్చన్నపేట : గీత కార్మికుల రక్షణ కోసం కాటమయ్య కిట్లు అందజేస్తున్నామని బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి బి.రవీందర్ అన్నారు. బుధవారం స్థానిక ఎల్లమ్మ గుడి వద్ద కిట్లను గీత కార్మికులకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బచ్చన్నపేట, కొన్నె, ఇటుకాలపల్లి, సాల్వాపూర్, నాగిరెడ్డిపల్లి, కేసిరెడ్డిపల్లి, బసిరెడ్డిపల్లి, రామచంద్రాపూర్, బండనాగారం, కట్కూర్ గ్రామాలకు చెందిన 62 మంది గీత కార్మికులకు కిట్లు అందజేశామని, వీటి సహాయంతో తాటి చెట్లు ఎక్కితే ఎలాంటి ప్రమాదాలు జరగవని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటమల్లికార్జున్, జిల్లా కోఆర్డినేటర్ బాల్నె వెంకటమల్లు, జూనియర్ అసిస్టెంట్ ఈర్ల కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీకి ఘన నివాళి



తరిగొప్పుల: రాజీవ్‌గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

సాక్షి నెట్‌వర్క్: మాజీ ప్రధాని, స్వర్గీయ రాజీవ్‌గాంధీ వర్ధంతిని జిల్లా వ్యాప్తంగా ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ శ్రేణులు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ దేశంలో సాంకేతిక విప్లవానికి నాంది పలికింది రాజీవ్ గాంధీనే అన్నారు. ఎన్నో సంక్షేమ పథకాలు తీసుకొచ్చి బడుగు బలహీన వర్గాలకు పెద్దపీట వేయడం జరిగిందన్నారు. ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝూన్సీరెడ్డి, వగలబోయిన యాదగిరి, అర్జుల పోషిరెడ్డి, ఇంద్రారెడ్డి, కల్వరాజు, ఎర్రవెల్లి పోషయ్య, శెట్టి సదయ్య,అరుణ్‌రెడ్డి, నర్సింహులు, సురేష్‌నాయక్, రాజేష్‌నాయక్, సాయికృష్ణ, భిక్షపతి, కోడూరి మహాత్మాచారి, జంగిటి విద్యానాథ్, నారాయణరెడ్డి, కోళ్ల రవిగౌడ్, లింగాల జగదీష్‌చందర్‌రెడ్డి, బొల్లం అజయ్ రాపాక సత్యనారాయణ, గిరగాని కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.



పాలకుర్తి టౌన్: నివాళులర్పిస్తున్న పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝూన్సీరెడ్డి



కొడకండ్ల: రాజీవ్ చిత్రపటం వద్ద నివాళులర్పింస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి తదితరులు



రఘునాథపల్లిలో..



బచ్చన్నపేటలో..

సంక్షిప్త సమాచారం

బియ్యం పంపిణీ

లింగాలఘణపురం: గుమ్మడవెల్లికి చెందిన గువ్వల ఉప్పలయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా, బుధవారం నేలపోగులకు చెందిన మాజీ ఎంపీటీసీ, సాంస్కృతిక సేన రాష్ట్ర కార్యదర్శి గుగ్గిళ్ల నర్సయ్య బాధిత కుటుంబాన్ని పరామర్శించి 50 కిలలో బియ్యం అందజేశారు. నాయకులు ఐలయ్య, రాంనర్సయ్య, రమేష్, కిష్టయ్య, ప్రవీణ్, రవి, మల్లయ్య, స్వామి, రత్నం ఉన్నారు.

అందుబాటులో జీలుగ విత్తనాలు

బచ్చన్నపేట: మండల కేంద్రంలోని ఆగ్రోస్ కేంద్రంలో జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, అవసరం ఉన్న రైతులు తీసుకెళ్లాలని మండల వ్యవసాయ అధికారి విద్యాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో ఆయన మాట్లాడారు. 300 బస్తాల జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఒక బస్తా 30 కిలోల బరువు ఉంటుందని, 2.20 ఎకరాల భూమికి సరిపోతుందన్నారు. విత్తనాలు అవసరం ఉన్న రైతులు పట్టేదారు పాస్‌పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్‌లను తీసుకొచ్చి ఆయా గ్రామాల ఏఈఓల వద్ద టోకెన్లు పొందాలని సూచించారు.

నియామకం

జనగామ రూరల్: బీజేపీ పూర్తి స్థాయి మండల కమిటీని జిల్లా అధ్యక్షుడు సౌడ రమేశ్ నియమించినట్లు మండల అధ్యక్షుడు లద్దునూరి మహేశ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలోనే మండల అధ్యక్షులను ప్రకటించగా, తాజాగా మండల కమిటీని నియమించారు. మండల ఉపాధ్యక్షులు బండ శ్రీనివాస్, జీనుకాల రవి, చెరుకూరి అనిల్, బడికె మమత, ప్రధాన కార్యదర్శులుగా నామాల మహేందర్, బీజ్జ రమేశ్, కార్యదర్శులుగా కేశవపట్నం కిరణ్, తేజావత్ రాధిక, నారామ్ కళ్యాణి, కూకట్ల బాలనరయ్య, కోశాధికారిగా విశ్వనాథుల రాజు నియమితులయ్యారు.

ఉమ్మడి జిల్లా చౌదరిగా జోగిని భవానీమాత



భవానీమాతకు చౌదరి బిరుదు ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి, లైలా

పాలకుర్తి టౌన్: ఉమ్మడి వరంగల్ జిల్లా చౌదరిగా మండల కేంద్రానికి చెందిన జోగిని భవానీమాతకు అరుదైన గౌరం దక్కింది. బుధవారం వరంగల్ నాని గార్డెన్స్‌లో ఓరుగల్లు శివశక్తుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లా చౌదరిగా జోగిని భవానీమాత బిరుదు రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి చేతుల మీదుగా ప్రదానం చేశారు. ఈ సందర్భంగా భవానీమాత మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా చౌదరిగా బాధ్యతలు అప్పగించిన జిల్లా అధ్యక్షురాలు లైలా, సంఘం నాయకులకు కృతజ్ఞాతలు తెలిపారు.

గూడ్స్ రైలు కిందినుంచి దాటుతుండగా ప్రమాదం

చేయి పోగొట్టుకున్న వ్యక్తి



గాయపడ్డ శ్రీనివాస్

జనగామ: జిల్లా కేంద్రం రైల్వేస్టేషన్‌లో 1వ ప్లాట్ ఫాం సమీపంలో ఆగిఉన్న గూడ్స్ రైలు కిందినుంచి ఓ వ్యక్తి దాటే క్రమంలో ప్రమాదవశాత్తు చేయి పోగొట్టుకున్న విషాద ఘటన బుధవారం చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిర వివరాల ప్రకారం.. రైల్వేస్టేషన్ 1వ ప్లాట్‌ఫాం సమీపంలోని లూప్‌లైన్‌పై ఆగిఉన్న గూడ్స్ రైలు కింద నుంచి బోయిని రాజయ్య కుమారుడు శ్రీనివాస్ దాటే ప్రయత్నం చేశారు. అదే సమయంలో రైలు కదలడంతో పట్టాలపై ఉన్న చేయిపై నుంచి వెళ్లడంతో నుజ్జు నుజ్జయింది. అక్కడే ఉన్న జనగామ మండల పరిషత్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ కూచన రాజు రైలు దాటొద్దంటూ వారించినా పట్టించుకోలేదు. సదరు వ్యక్తి అప్పటికే రైలు కిందకు వెళ్లగా, కనీసం చేతులు దగ్గరకు పెట్టుకోవాలని అరిచినా వినిపించుకోక పోవడంతో ప్రమాదం జరిగింది. వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించి రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. క్షతగాత్రుడిని జిల్లా ఆస్పత్రికి తరలించగా, పరిస్థితి విషమించడంతో వరంగల్ ఎంజీఎంకు తరలించారు. కూతురు శ్యామల, అల్లుడు వెంకటేశ్ నర్మెటలో ఉంటారని చెబుతున్న శ్రీనివాస్ ఊరి పేరు చెప్ప లేకపోతున్నాడన్నారు. అతని సమాచారం తెలిసిన వారు 9440027342, 9010 100958 నంబర్లకు సమాచారం అందించాలన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

జనగామ రూరల్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి కావలసిన ఏసీలు సరఫరా చేసేందుకు ఆసక్తి కలిగిన వారి నుంచి టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల బిడ్డర్లు రూ.2వేలు డీడీ తీసి దరఖాస్తులను సమర్పించాలన్నారు. దరఖాస్తులు జనరల్ ఆస్పత్రిలో అందుబాటులో ఉంటాయని, ఈ నెల 26 నుంచి 31వ తేదీన మధ్యాహ్నం 3 గంటల వరకు కలెక్టరేట్‌లో దరఖాస్తుల స్వీకరించనున్నట్లు వెల్లడించారు. జూన్ 3న ఉదయం 11 గంటలకు కలెక్టరేట్‌లో దరఖాస్తులను ఓపెన్ చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.